పేద రైతులకు పట్టాభిషేకం

- భూ పట్టాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


భూ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఇరవై ఏళ్లకు పైగా పేదల సాగు చేసుకుంటున్న భూములకు సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయడంతో పేద రైతుల కళ్లల్లో ఆనందం కన్పిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెంటాడ పంచాయతీకి చెందిన పలువురు పేదలు సాగుచేసుకుంటున్న భూములకు శనివారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించడం గత ప్రభుత్వంలో ఎన్నడూ లేదన్నారు. పేద ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌పై ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అడ్డగోలు విమర్శలను ఎవరూ పట్టించుకునే పరిస్థితిలో లేరన్నారు. పేదల ఇంట్లో మంచి జరిగిందని నమ్మితేనే ఓటు వేయండని ధైర్యంగా చేప్పే నాయకుడు సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఎస్.రెడ్డి, నాయకులు అర్జున్ రెడ్డి, గురయ్య, కొయ్య అప్పలస్వామి, సువాడ లక్ష్మము, దుక్క సన్యాసి, ముక్కు లక్ష్మణ, వెంపాడ సూరప్పన్న, బాకి ఇంద్ర, మునకాల రాము తదితరులు ఉన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


దూదివారి కోవెలలో తులసీమాల అలంకరణలో వేంకన్నస్వామి


నారాయణ తిరుమలలో పూజలందుకున్న స్వామివారు


మొండేటివీధిలో పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలో ఉత్తరాంధ్రా తిరుమల కొండగా పేరు పొందిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి దర్శనాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామికి ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు, ఉచిత దర్శనాలు జరిగాయి. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేయించి, పూజలు నిర్వహించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.

పూలమాలలతో అలంకరణ

పట్టణంలోని చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని పూలమాలలతో అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు.

ప్రత్యేక అలంకరణ

మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి.

క్లుప్తంగా

రాజరాజేశ్వరికి వెండి ఆభరణాలు బహూకరణ


వెండి శఠగోపం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీ వద్దగల గోవిందనగర్ కాలనీలో వేంచేసిన రాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి భక్తులు కొత్తకోట మధుసూదన్‌రావు, జగదీశ్వరీ దంపతులు వెండి శఠగోపం, ఇత్తడి తాంబూలంలను బహూకరణ చేశారు. మాఘపౌర్ణమి సందర్భంగా ఈ ఆభరాలను ఆలయ ధర్మకర్త మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతులకు అందచేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ నాయకులు బిర్లంగి రామ్మోహన్ రావు, సుజాత, అర్చకులు బంకుపల్లి చరణ్‌శర్మ ఉన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు


ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారితోపాటు, రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను శనివారం పరిశీలించారు. తహసీల్దార్ వి.శ్యాంకుమార్ మాట్లాడుతూ మొత్తం ప్రభుత్వ స్థలాన్ని సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.


నారువలో బీజేపీ ప్రజాపోరు యాత్ర


ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రణస్థలం: బీజేపీ బలోపేతమే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని నారువ పంచాయతీలో ప్రజాపోరు యాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జీరు గురునాథరెడ్డి, జిల్లా కో కన్వీనర్ పీవీ రత్నం, జిల్లా అధికార ప్రతినిధి పతివాడ పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- శ్రీకాకుళం ఎంపీపీ అంబటి నిర్మల


మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

శ్రీకాకుళం రూరల్: ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని, ఏదైనా సమస్య వస్తే స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేసిన వెంటనే దాన్ని పరిష్కరించే దిశగా చర్య తీసుకోవాలని శ్రీకాకుళం ఎంపీపీ అంబటి నిర్మల అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెదగనగళ్లవానిపేట, వప్పంగి, సానివాడ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని, కొన్ని ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలని, ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు సరిచేయాలని పలువురు సభ్యులు కోరారు. వెంటనే దాన్ని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యుత్ శాఖాధికారిని ఆదేశించారు. పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, సకాలంలో పశువులకు వ్యాక్సిన్ వేయాలని, సింగుపురం ఎండీటీసీ సభ్యుడు నక్క శంకర్ కోరారు. సమావేశంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీను, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

రణస్థలం: రణస్థలంలోని కొత్త పెట్రోల్ బంక్ వెనుక, కొండములగాం పంచాయతీ పరిధి ముక్తుంపురం రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న అంబేడ్కర్ సామాజిక భవనం శంకుస్థాపనకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఆదివారం విచ్చేయుచున్నారు. ఈ మేరకు అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.

వలంటీర్ల సేవలకు సత్కారం


వలంటీర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: వలంటీర్లు ప్రజలకు మరింత చేరువుగా ఉండి ఉత్తమ సేవలను అందించాలని అదపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లె ప్రభాకర్ తెలిపారు. లావేరు మండలంలోని అదపాక సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టూడెంట్ వింగ్ జిల్లా జాయింట్ సెక్రటరీ నడిమింటి సునీల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

లంకపేటలో వైద్యశిబిరం

గార: గొంటి పంచాయతీ లంకపేట గ్రామంలో శ్రీకూర్మం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వీవీఎస్ఎన్ మూర్తి రోగులకు పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో బొత్స ఝాన్సీ


ఆదిత్యుని జ్ఞాపికను ఝాన్సీకి అందజేస్తున్న ఈఓ రమేష్‌బాబు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మాజీ ఎంపీ, విశాఖ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స ఝాన్సీ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, అర్చకబృందం ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పంపిణీలో.. జి.సిగడాం నంబర్ వన్


సమావేశంలో పాల్గొన్న పీడీ చిట్టిరాజు, అధికారులు

జి.సిగడాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ రకాల పనులు, రికార్డుల నిర్వహణలో జిల్లాలోనే జి.సిగడాం మండలం నంబర్ వన్‌గా నిలిచిందని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామ సభలో వివరాలు వెల్లడించారు. వేతనదారులకు పనులు కల్పించడం, పంచాయతీరాజ్ ద్వారా రోడ్లు, వెలుగు ద్వారా అర్హులై వారికి పంఛన్లు, గృహనిర్మాణం, మొక్కల పెంకం, తాగునీటి సదుపాయం తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారుల పని తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ఎంపీడీఓ కుచ్చెర్లపాటి రామకృష్ణంరాజు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురిషోతంనాయుడు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, హౌసింగ్ ఏఈఈ ఎం.రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలంలోని గుమ్మడాం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు మీసాల శ్రీనివాసరావు, చిల్ల వెంకట రెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జగ్గరోతు తవిటినాయుడు, గుమ్మడాం సర్పంచ్ గంధవరపు పైడియ్య, డి.ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి శ్రీరాములు, నాగం కనకరాజు, వాళ్లె దాలినాయుడు, సూర్యనారాయణ, రమణ, లక్ష్మణ, యేసుబాబు, తలే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అగ్నిమాపక, విపత్తుల శాఖ డీజీపీ, ఎయిమ్ వ్యవస్థాపకుడు సునీల్‌కుమార్ అన్నారు. లావేరు మండలం గుమ్మడాంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. స్థానిక యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొడదాం


మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ నాగభూషణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలతోపాటు సమీపంలో ఉన్న భారతి ఐటీఐ సంస్థలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా హెచ్ఐవీ నివారణ, నిర్మూలన సంస్థ సలహా మేరకు చక్రపాణికళా బృందం వారిచే అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ టీబీ, రక్తదాన అవశ్యకతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ రామారావు, కొత్తకోట రవీంద్ర మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎల్‌డబ్ల్యూఎస్ జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో పాజిటివ్ నెట్‌వర్క్ సిబ్బంది, వైసీబీ పీయూపీ ఎం.శ్రీదేవి, శారద, రమణ పాల్గొన్నారు.

దుర్గామహాలక్ష్మి ఆలయంలో హోమాలు


హోమ పూజల్లో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గామహాలక్ష్మి దేవాలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం విశేషమైన సుగంధ ద్రవ్యాలతో లలితా త్రిపుర సుందరీ దేవికి హోమాలు జరిగాయి. అర్చకులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే శ్రీసూక్త సహిత కమలాలయ మహా హవనం సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మండల మన్మథరావు, సాంగల కృష్ణ, చిన్న గణేష్, సత్యం, లావేటి శ్యామ్, మహిళా సభ్యులు బరాటం పద్మ, రవళి కల్యాణి, శ్రీలక్ష్మి, మంజుభార్గవి, లావేటి స్వప్న, మేనక, పట్టపగులు సోదరీమణులు, డోకి జనార్దన ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


కలశాలతో భక్తులు, అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి కల్యాణ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు నిర్వహణలో మూలమూర్తులకు అభిషేకాలు, అలంకరణలు చేశారు.

పుష్పాలతో అర్చనలు చేశారు. అలాగే సంప్రదాయబద్ధంగా మండపంలో ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి కల్యాణ వేడుకలు నిర్వహించారు. భక్తులు అధికంగా పాల్గొన్నారు.

ఒలింపియాడ్ విజేతలకు అభినందన


పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: నిరంతర సాధనతో విద్యార్థుల్లో ఉన్న భయాన్ని, ఆందోళనను తగ్గించవచ్చని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఒలింపియాడ్ విజేతలకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూఢిల్లీకి చెందిన ఎస్‌వోఎఫ్ అనే సంస్థ దేశ వ్యాప్తంగా ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహిస్తుంది. సైన్స్ ఒలింపియాడ్ విభాగంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నుంచి రికార్డుస్థాయిలో మొత్తం 12 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. వీరందరికీ శనివారం మెడల్స్‌తోపాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. పాఠశాల కో ఆర్డినేటర్‌లు దీప, దేవి, విజయ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

- మూడు వాహనాలు ఢీ


ప్రమాద దృశ్యం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని జాతీయ రహదారి బైరి జంక్షన్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మూడు వాహనాలు ఢీకున్నాయి. విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న లారీ బ్రిడ్జి ఎక్కుతుండగా ఒక్కసారిగా డ్రైవర్ స్లో చేయడంతో దాని వెనుక వస్తున్న మరో లారీ దాన్ని ఢీకొట్టింది. అదే స్పీడులో వస్తున్న ఇంకో లారీ దానిముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు శ్రీకాకుళం సెపెక్‌తక్ర జట్టు


బాలురు జట్టు సభ్యులతో కోచ్ అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సెపక్‌తక్ర పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రతిభ కనబరుస్తోంది. లీగ్ దశ నుంచి ఓటమి లేకుండా క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. నెల్లూరు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలురు జట్టు తానాడిన మూడు మ్యాచ్‌ల్లోను ఘన విజయాలు సాధించి సత్తాచాటింది. ఆ సంఘ జిల్లా కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి ప్రోత్సాహంతో మొదటి మ్యాచ్‌లో తూర్పు గోదావరిపై 21-15, 21-10 తేడాతో, తదుపరి మ్యాచ్‌లో పుట్టపర్తిపై 21-11, 21-11 తేడాతో, కీలకమైన నంద్యాలపై 21-09, 21-15 తేడాతో జయకేతనం ఎగురవేసి జిల్లా బాలురు జట్టు హ్యాట్రిక్ విజయాలతో సగర్వంగా క్వార్టర్స్‌కు ప్రవేశించింది. జిల్లా జట్టు రాణింపుపై సెపక్‌తక్ర సంఘ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు.


'ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'


మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ మాత్రమే కృషి చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శనివారం శ్రీకాకుళం 1, 2 డిపోల ముఖ్యకార్యకర్తల సమావేశం ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గూనాపు త్రినాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దామోదరరావు మాట్లాడుతూ పలు సమస్యలను ప్రస్తావించి వాటిని పరిష్కరించిన విధానాన్ని వివరించారు. సమావేశంలో ఈయూ సీనియర్ నాయకులు రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్.అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మ, కొర్లాం గణేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా ఈయూ కార్యదర్శి ధశరదుడు, శ్రీకాకుళం 1,2 డిపోల ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు జీబీ మూర్తి, యస్.రమణ, జీఆర్ కృష్ణ, కె.బాబూరావు, లలితకుమారి, వనజాక్షి, ఓజమ్మ తదితరులు పాల్గొన్నారు.



లలితాదేవికి ప్రత్యేక పూజలు


కుంకుమ పూజలను నిర్వహిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: మండలమంలోని దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేటలోని లలితాదేవి అమ్మవారికి శ్రావణ శుద్ధ పూర్ణిమ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమపూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మంత్రి ధర్మాన పరామర్శ


సుగ్గు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రసాదరావు

గార: వమరవల్లి సర్పంచ్, శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తల్లి సుగ్గు లక్ష్మీభాయి ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం ఉదయం పరామర్శించి సంతాపం తెలియజేశారు.

అలాగే విశ్రాంత వీఆర్వో మార్పు బాబూజీరావు (బాబ్జీ) మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కూడా మంత్రి ధర్మాన పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గొండు రఘురామ్, ముంజేటి కృష్ణమూర్తి, స్థానిక నాయకులు ఉన్నారు.

తిలక్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎంపీ ల్యాడ్ నిధులతో చేపట్టనున్న తిలక్‌హాలు నిర్మాణానికి శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడు కె.రామ్మోహన్‌నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్రకలిగిన ఈ స్కూల్‌లో ఒక భవన నిర్మాణం కోసం తనవంతు సహకారం అందించే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఈఈ పొగిరి సుగుణాకరరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వీజీకే మూర్తి, ప్రధాన కార్యదర్శి జామి భీమశంకర్, కోశాధికారి జె.ఎస్.ఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షులు పేర్ల కామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలమురళీ, స్కూల్ హెచ్ఎం దేవదత్తానందం, సీహెచ్ వరప్రసాద్, టీపీవో ఉమామహేశ్వరరావు, జె.ఎం.ఆర్.రాజు, కిల్లాన ఫాల్గుణరావు, డాక్టర్ శేషగిరి, ఢిల్లీ భాస్కర్, పిండి శారద, నాగేశ్వరరావు, నల్లాన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

